# పెళ్ళిలో ప్రణయం

## సి.ఎస్.చంద్రశేఖర్

**అమెరికా నుండి స్వదేశానికి వస్తున్న కొడుకు కోసం హైదరాబాద్ ఎయిర్పోర్టులో ఎదురు చూస్తున్నారు సుజాత, రాఘవేంద్రరావు.**

**రాఘవేంద్రరావు సుజాతవైపు చూసాడు. ఆమె ముఖంలో ఆనందం, ఎగ్జయిట్‌మెంట్ రెండూ కనిపించాయి. అవును మరి... అయిదుమంది ఆడపిల్లల్ని, ముగ్గురు మగపిల్లల్ని కన్న మధ్య తరగతి తల్లిదండ్రులకు ఏడో సంతానం ఆమె. తండ్రి జీతమంతా వాళ్ళ ఫీజులకూ, పుస్తకాలకూ సరిపోయేది. ఎన్నో పూటలు పస్తులు గడిపారు. ఎన్నో విషయాల్లో నిరాశ చెందింది. మరెన్నో విషయాల్లో రాజీ పడింది.**

పిల్లలందర్నీ ఎలాగో డిగ్రీ వరకు చదివించి పెళ్ళిళ్ళు చేసాడు తండ్రి. అయితే ఆయన పిల్లలకు ఇచ్చిన విలువైన ఆస్తి క్రమశిక్షణ. అందువల్లే ఆయన పిల్లలు అన్నిచోట్లా మంచి పేరు సంపాదించారు. అటువంటి బాల్య జీవితం గడిపిన సుజాత మరి నేడు? కొడుకు అమెరికా నుంచి తిరిగొస్తుంటే స్వంత కారులో వచ్చి ఎయిర్‌పోర్టులో ఎదురు చూస్తోంది. ఆర్థికంగా ఎదుగుదల కూడా మనిషికి ఎంతో సంతృప్తిని ఇస్తుంది అని చెప్పడానికి సుజాతే ఉదాహరణ. పెళ్లప్పుడు సన్నగా, రివటలా కనిపించిన సుజాత ఈ రోజు కాస్త లావుగా, నిండుగా కనిపిస్తుంది. కారణం తృప్తి.

ఫ్లైటు వస్తుందన్న అనౌన్స్‌మెంట్ విని తన ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెట్టి ఆతృతగా కొడుకు కోసం ఎదురు చూడసాగారు. వంశీ తమ దగ్గరకు రాగానే ఆప్యాయంగా అతని చేయి పట్టుకుని పలుకరించారు. కారులో కూర్చుని ఇంటికి వస్తూ కొడుకుతో-

"వంశీ! నీకోసం నాలుగు సంబంధాలు చూసి ఉంచాను. నీవు మళ్ళీ అమెరికా వెళ్ళేలోపు ఏదో ఒకటి ఓకే చేయాలి" అంది సుజాత.

"అలాగే అమ్మా. అయితే ఓ కండిషన్. అమ్మాయి నాకు నచ్చాలి."

"నీకు నచ్చకపోతే మా బలవంతం ఉండదు. నీకు నచ్చితే మాకు ఏ అభ్యంతరం ఉండదు. మాకు కావలసింది అందం, మంచి మనసున్న పిల్ల" అంది సుజాత. కొంతసేపు తరువాత "అన్నట్లు వంశీ! మన హరికి రేపు ఉదయం పెళ్ళట. ఇంటికి వచ్చి కార్డు ఇచ్చి వెళ్లాడు. నీవు వస్తున్నావని చెప్తే ఎంతో సంతోషించాడు. నిన్ను పెళ్లికి తప్పకుండా రమ్మన్నాడు" అంది సుజాత.

"మరి చెప్పవేం అమ్మా. ఎక్కడ పెళ్లి?"

"పార్వతీపురం అని ఓ పల్లెటూళ్ళో పెళ్లి, అమ్మాయి వాళ్ళ ఊరట. సిటీకి యాభై కిలోమీటర్ల దూరం అని చెప్పాడు. కార్డులో ఆ ఊరి రూటు క్లియర్‌గా ఇచ్చానని చెప్పాడు."

"అయితే నేను మధ్యాహ్నం భోజనం కాగానే బయలుదేరుతాను."

"ఇప్పుడే వచ్చి అంతలోనే ప్రయాణమేమిట్రా. ఎల్లుండి సిటీలోనే రిసెప్షన్ ఉంది. మనం ముగ్గురం కలసి వెళ్దాం."

"అమ్మా! రిసెప్షన్‌కు వెళితే పెళ్లికి వెళ్లినట్లు కాదు. పెళ్లికి వెళ్లడం ముఖ్యం. నేను ముహూర్తం కాగానే వచ్చేస్తానుగా."

"నీ ఇష్టం" అయిష్టంగానే ఒప్పుకుంది సుజాత.

"కారులో వెళ్తావా?" రాఘవేంద్రరావు అడిగాడు.

"అవును నాన్నా!"

"అమెరికా రోడ్డు అనుకుని ఫాస్ట్‌గా డ్రైవ్ చేసేవు. నీవు వెళ్తున్నది ఇండియాలోని ఓ పల్లెటూరుకు అన్న విషయం గుర్తు పెట్టుకుని డ్రైవ్ చేయి."

"అలాగే."

***

మధ్యాహ్నం ఒంటిగంటకు కారులో బయలుదేరాడు వంశీ. స్టీరియోలో 'మనసంతా నువ్వే' చిత్రంలోని 'చెప్పవే ప్రేమా, చెలియ చిరునామా' పాట వస్తోంది. ఆ పాట అతని హుషారును మరింత పెంచింది. ఉత్సాహంగా డ్రైవ్ చేస్తున్న అతనికి సిటీ పొలిమేరల్లో రోడ్డు ప్రక్కన నిలబడి ఉన్న నలుగురు అమ్మాయిలు కనిపించారు. వాళ్లల్లో ఒకమ్మాయి చేయి చాపి ఆపమన్నట్లు సైగ చేయడంతో బ్రేక్ వేసి కారు ఆపాడు.

"ఏయ్ జయా! రోడ్డు మీద ఎవరు కనబడితే వాళ్ళను లిఫ్ట్ అడిగెయ్యడమేనా?"

"మరేం చెయ్యనే. ఎంతసేపటికీ బస్సు రావడం లేదు. ఒకవేళ ఇకపై వచ్చినా ముహూర్తాల రోజులు కనుక రష్‌గా వుంటుంది. ఆయన ఎంత దూరం వెళ్తాడో కనుక్కుని అంతవరకైనా మనం వెళ్దాం."

వంశీ కారు దిగి వాళ్ళను సమీపించాడు. ఆ నలుగురిలో ఓ అమ్మాయి చాలా అందంగా ఉంది. చూడగానే చాలా నచ్చింది అతనికి.

"రండి. మీరెక్కడికి వెళ్లాలో చెబితే డ్రాప్ చేస్తాను" అన్నాడు.

"అమెరికాకు వెళ్లాలి. డ్రాప్ చేస్తారా?" ఓ అమ్మాయి కొంటెగా అడిగింది.

"సారీ. ఈ రోజే అమెరికా నుంచి వచ్చాను. మళ్లీ అంత దూరం వెంటనే ప్రయాణం చేయలేను."

"కోతలరాయుడులా ఉన్నాడే" మరో అమ్మాయి అంది మెల్లగా. వాళ్ళు సంశయిస్తుండడం చూసి "మీకేం భయంలేదు. నేనూ చదువుకున్నవాడినే. రండి. నాకూ కంపెనీ వుంటుంది" అన్నాడు.

"మేము పార్వతీపురం వెళ్లాలి" అందమైన అమ్మాయి అంది.

"నేనూ పార్వతీపురానికే వెళుతున్నాను" అన్నాడు ఆశ్చర్యంగా.

"కోత నెంబర్ టూ" జయ అంది మెల్లగా.

నలుగురూ కారులో కూర్చున్నారు.

కారు డ్రైవ్ చేస్తూ "మీరు ఇంజనీరింగ్ చదువుతున్నారా?" అని అడిగాడు.

"అవును. ఎలా కనుక్కున్నారు?"

"ఇంజనీరింగ్ కాలేజీ స్టాఫ్ దగ్గర కనిపించారు కనుక ఊహించాను. ఏ గ్రూపు."

"కంప్యూటర్ సైన్సెస్."

"అరె...నా గ్రూపే!"

"కోత నెంబర్ త్రీ" జయ మెల్లగా అంది.

"పార్వతీపురం దేనికి వెళ్తున్నారు మీరు?" అందమైన అమ్మాయి అడిగింది.

"నా స్నేహితుడు హరికృష్ణ పెళ్లికి."

అతని నోట పెళ్లికొడుకు పేరు విన్నాక నిజమే చెబుతున్నాడని నమ్మకం కుదరింది వాళ్ళకి.

"మేమూ ఆ పెళ్లికే వెళుతున్నాము. పెళ్లికూతురు మా క్లాస్‌మేట్" జయ అంది.

"అలాగా.. వెరీగుడ్!"

కార్డులో ఇచ్చిన అడ్రస్ ప్రకారం పార్వతీపురం గ్రామంలో ప్రవేశించి సత్రం చేరుకున్నారు. కారు

ఓ మూలగా పార్క్ చేసాడు వంశీ. అమ్మాయిలు అతనికి థాంక్స్ చెప్పి సత్రంవైపు నడిచారు.

వంశీ డోర్ లాక్ చేస్తూ చివరగా వెళ్తున్న ఆ అందమైన అమ్మాయిని "ఏవండీ" అని పిలిచాడు.

వెనక్కు తిరిగి చూసింది ఏమిటన్నట్లు.

"మీ పేరు చెప్పనేలేదు."

"మీ పేరు చెప్పారా?"

"సారీ నా పేరు వంశీ."

"నా పేరు సుప్రజ."


"స్వీట్‌నేమ్" మనసులో అనుకోబోయి పైకే అనేసాడు.

"ఉంటాను. మళ్ళీ కలుద్దాం" అంటూ ముందుకు కదిలింది. అందమైన ఆ నడకనే చూస్తూ ఆమెను అనుసరించాడు వంశీ.

"అరే వంశీ... వాటే సర్‌ప్రైజ్!"

హరి గొంతు విని ఉలిక్కిపడి చూసాడు. సత్రం బయట నిలబడి వున్నాడు హరి.

అతన్ని సమీపించి



"అంటే నీ పెళ్ళికి నేను రాననుకున్నావా?" అని అడిగాడు.

"నిజంగా రావనే అనుకున్నాను. నీవు అమెరికా నుండి ఉదయమే వచ్చి ఉంటావు. అమ్మ వెంటనే ప్రయాణమంటే ఒప్పుకుంటుందా అని అనుమానం వచ్చింది."

లోపలికి వెళ్ళిన స్నేహితురాళ్ళు పెళ్ళికూతురు చెల్లెలుతోపాటు బయటకు వచ్చారు ఆ అమ్మాయి తన అక్కయ్యకు కాబోయే భర్తను వాళ్ళకు పరిచయం చేస్తానని చెప్పడంతో. వచ్చి హరి, వంశీ మాటలు విన్నారు.

"ఒప్పుకోలేదు. ఒప్పించాను. ఇంతకూ పెళ్ళికూతురు ఎక్కడ?"

"వాళ్ళింట్లో వుంది. మీనా రెండు కప్పులు కాఫీ పంపించవూ" పెళ్ళికూతురు చెల్లెలితో అన్నాడు హరి.

"అలాగేబావా. వీళ్ళు అక్కయ్య క్లాస్‌మేట్స్" అంటూ పరిచయం చేసింది నలుగురినీ. వంశీని మీనాకు పరిచయం చేసాడు హరి. కాఫీ త్రాగుతూ తన ఉద్యోగం గురించి హరికి వివరించాడు వంశీ. తరువాత హరి తల్లిదండ్రులను, చెల్లెళ్లను పలుకరించాడు.

"వంశీ! పెళ్ళికూతురింట్లో ఓ గది నాకోసం కేటాయించారు. అక్కడ ప్రశాంతంగా ఉంటుంది. నీవు వెళ్లి కాసేపు పడుకుని రెస్ట్ తీసుకో."

"ఫర్వాలేదులేరా. నేనేం అంతగా అలసిపోలేదులే."


"నీవెంత అలసిపోయావో నీ ముఖం చూస్తేనే తెలిసిపోతుంది. వెళ్ళు. వాళ్ళ మనిషిని పంపుతాను నీతో."

"సరే నీ ఇష్టం!"

***

గదిలో డ్రెస్ ఛేంజ్ చేసుకుని టీషర్టు, లుంగీ ధరించాడు. మంచంపై పడుకుని ఏదో ఆలోచిస్తుంటే "ఎక్స్‌క్యూజ్‌మీ" అన్న తియ్యని గొంతు వినిపించింది.

"రండి" అన్నాడు.



## టాబూ బెంగాలీ సినిమా

టాబూ మంచి హీరోయిన్, చక్కగా నటించగలదు. అందుకే బెంగాలీ సినిమాలో అవకాశం కొట్టేసింది. అవికాక మరో మూడు సినిమాలు చేతిలో వున్నాయిట. తన టాలెంట్‌తో మాత్రమే తనకీ అవకాశాలు వస్తున్నాయని, అందరిలా జిమ్మిక్స్ చేయడం లేదని టాబూ సెలవిస్తోంది. ఓకే టాబూ! మంచిదేగా! ఆల్ ది బెస్ట్!

– శశి

సుప్రజ లోపలకు వచ్చింది. ఆమె చేతిలో కాఫీ కప్పు ఉంది. "కాఫీ తీసుకోండి."

"నేను ఇందాకే తాగాను. హరి తెప్పించాడు."

"అది మీ ఫ్రెండ్ తెప్పించిన కాఫీ. ఇది ఈ ఫ్రెండ్ తెచ్చిన కాఫీ. తీసుకోండి."

"థాంక్యూ!" అంటూ కప్పు అందుకున్నాడు.

"మీరు నిజంగానే అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారని తెలిసి మా ఫ్రెండ్స్ ఆశ్చర్యపోయారు. మీరు కోతలు కోస్తున్నారని భావించారు వాళ్ళు."

"ఫర్వాలేదులెండి. వాళ్ళన్నవన్నీ నాకూ వినబడ్డాయి. అయితే వాళ్ళ మాటలవల్ల నాకేం నష్టంలేదని పట్టించుకోలేదు."

"యు ఆర్ వెరీ బ్రాడ్" అంది మెచ్చుకోలుగా.

కాఫీ కప్పు తీసుకుని వెళ్తున్న సుప్రజతో "మీరు తెచ్చిన కాఫీ మీ అంత బాగుంది" అన్నాడు.

"థాంక్స్" అంటూ సిగ్గుపడుతూ వెళ్లిపోయింది.

***

ఉదయం అయిదుగంటలకు ముహూర్తం కావడంతో రాత్రి కొంతసేపు స్నేహితులతో కాలేజీ కబుర్లు నెమరువేసుకుని పదకొండు గంటలకు సత్రంలో మేడమీద పడుకున్నాడు వంశీ. అతడు ఆకలినైనా తట్టుకుంటాడుగానీ నిద్రలేమిని మాత్రం భరించలేడు. రాత్రి పదిగంటలకు పడుకోవడం, ఉదయం వీలైనంత త్వరగా నిద్రలేవడం అతనికి అలవాటు చేసారు అతని తల్లిదండ్రులు.

ఉన్నట్టుండి గట్టిగా కేకలు వినబడితే ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు.

"ఏమైంది?" ప్రక్కనే కూర్చుని వున్న స్నేహితుడ్ని అడిగాడు.

"ఏంకాలేదు. అమ్మాయిలు టేప్‌లో పాటలు పెట్టుకుని డాన్స్ చేస్తున్నారు. ఆ ఊపులో కేకలు వేస్తున్నారు. నాకూ నిద్ర పట్టక కూర్చున్నాను."

"ఎవరువాళ్ళు?" విసుగ్గా అడిగాడు.

"పెళ్లికూతురి ఫ్రెండ్స్. నీతో కారులో వచ్చారే వాళ్ళు."

మళ్ళీ పడుకున్నాడు. కానీ ఎంతసేపటికీ నిద్ర పట్టలేదు. వారి అరుపులూ, డ్యాన్సులు అతనికి నిద్ర పట్టనీయడంలేదు. లేచి కూర్చుని "నేను వెళ్లి వాళ్ళకి చెప్పి వస్తాను" అన్నాడు.

"వద్దురా. వాళ్ళు పెళ్లికూతురి ఫ్రెండ్స్. మనమేమన్నా అన్నామంటే హరికి మాట వస్తుంది. వాడు బాధపడతాడు."

"వాళ్ళకైనా సెన్స్ ఉండాలి. రేర్‌గా ఇలాంటి అకేషన్స్‌లో కలుస్తారు కాబట్టి ఎంజాయ్ చేయాలి. కాదనను. కానీ మన ఎంజాయ్‌మెంట్ మరొకరికి ఇబ్బంది కలిగించకూడదన్న ఇంగితజ్ఞానం కూడా ఉండాలి. మనం చేయలేదా డాన్సులు? ఏనాడైనా దానివల్ల ఇంకొకరికి ఇబ్బంది కలిగించామా?"

"అందరూ నీలా ఎదుటి మనిషి గురించి ఆలోచిస్తే బాధేముంది. పడుకో."

విసుగ్గా పడుకున్నాడు. ఒంటిగంటకు నిద్ర పట్టింది. అదీ ఆ సమయానికి వాళ్ళ డాన్స్ ప్రోగ్రాములు ముగిశాయి కాబట్టి.

***

ఉదయం నాలుగుగంటలకు నిద్ర లేచాడు వంశీ. బ్రష్ చేసుకుని స్నానం చేసాడు. డ్రస్ చేసుకుంటుంటే సుప్రజ వచ్చింది.

వంశీ ఆమెతో ఏం మాట్లాడలేదు. ముందు రోజు రాత్రి తనకు నిద్ర లేకుండా చేసారన్న కోపంతో పాటు అంత అందమైన అమ్మాయికి సంస్కారం లేకపోవడం అతన్ని నిరాశపరిచింది.

"గుడ్‌మార్నింగ్. కాఫీ ఫర్ యూ. మీకోసం కాఫీ స్పెషల్‌గా చేయించి తెచ్చాను."

ముభావంగా కప్పు అందుకుని త్రాగసాగాడు. త్రాగుతూ మెల్లగా కళ్లెత్తి ఆమెవైపు చూసాడు. ఆమె కళ్ళు కూడా నిద్రలేమిని సూచిస్తోంది. 'రాత్రంతా ఎగిరిందిగా?' అనుకున్నాడు మనసులో కసిగా.

"ఏమిటలా వున్నారు? రాత్రి నిద్ర పట్టలేదా?" సుప్రజ అడిగింది.

కోపంగా ఆమెవైపు చూసి ఏదో అనబోయాడు. అంత అందమైన ముఖం చిన్నబోవడం ఇష్టంలేక కప్పు ఆమె చేతికిచ్చి గబగబా మేడ దిగి క్రిందకి వచ్చేసాడు. సుప్రజ కంట్లో నీరు అతను చూడలేదు.

***

మాంగల్యధారణ కాగానే హరికి అమెరికానుంచి తెచ్చిన కెమెరా పెళ్లికానుకగా బహూకరించాడు వంశీ. ఏడుగంటలకు ఫ్రెండ్స్‌తోపాటు టిఫిన్ తినడానికి కూర్చున్నాడు. సుప్రజ వచ్చి వంశీకి, అతని ఫ్రెండ్స్‌కి ఏం కావాలో కనుక్కుని వడ్డించసాగింది.


"ఒరేయ్! ఆ అమ్మాయి నీవంటే మనసు పడినట్లుంది" ఓ ఫ్రెండ్ అన్నాడు.

"అవున్రా. నువ్వు ఫార్వర్డ్ అయిపో. ఇద్దరూ మేడ్ ఫర్ ఈచ్ అదర్‌లా ఉంటారు" ఇంకో ఫ్రెండ్ అన్నాడు.

వంశీ నవ్వి ఊరుకున్నాడు. సుప్రజ ఎంత ప్రయత్నించినా వంశీ ఆమెతో మాట్లాడలేదు.

టిఫిన్ తిన్నాక స్నేహితుల దగ్గర సెలవు తీసుకున్నాడు.

"భోజనం చేసి వెళ్లవచ్చుగా వంశీ!"




జబ్బేమీ కాదు! గమనించి చూస్తే మెడకింద సెల్ ఫోన్ కన్పిస్తుంది!..

"లేదురా. అమ్మ నాకోసం ఎదురుచూస్తూ వుంటుంది."

హరికోసం చూసాడు. అతడు మామగారి ఇంటికి వెళ్లాడని తెలిసి అక్కడికి వెళ్లి సెలవు తీసుకోవచ్చని కారు స్టార్టు చేసాడు. కారు మిర్రర్‌లో సుప్రజ కనిపించింది. తల తిప్పి ఆమెవైపు చూసాడు. ఎరవు రంగు బార్డర్ వున్న తెల్లని పట్టుచీరలో దేవకన్యలా కనిపించింది.

"వెళ్లిపోతున్నారా?" బాధగా అడిగింది.

అతడు తల తిప్పుకుని కారును ముందుకు పోనిస్తూ అద్దంలో చూసాడు. ఆమె కన్నీరు తుడుచుకుంటోంది. అతనికి ఒక్కక్షణం ఆమెపై జాలి వేసింది. 'ఆమెను బాధపెట్టే హక్కు తనకెవరిచ్చారు?' అని కూడా అనిపించింది. మళ్లీ మనసును గట్టి చేసుకుని కారును ముందుకు నడిపించాడు. హరిని అతని మామగారింట్లో కలిసాడు. అందరూ ఓ ముసలావిడ చుట్టూ నిలబడి ఉన్నారు.

"ఏమైందీ?" కంగారుగా అడిగాడు వంశీ.

"ఏంలేదు. ఆవిడ నా భార్య మాధవి అమ్మమ్మ. ఆమె ఆరోగ్యం క్షీణించడంతో తను బ్రతికుండగానే మాధవి పెళ్లి చేయాలని పట్టుబట్టింది. అందుకే మాధవి ఇంకా చదువుతుండగానే పెళ్లి నిశ్చయం చేసారు. దినదినం క్షీణిస్తున్న ఆమె ఆరోగ్య పరిస్థితి చూసి పెళ్లికి ముందే ఆమెకేదైనా అవుతుందేమో అని టెన్షన్ పడ్డాం. అయితే దేవుడి దయవల్ల పెళ్లి ఏ ఆటంకం లేకుండా జరిగిపోయింది. ఆమె ఆశీస్సుల కోసం మేము ఇక్కడికి వచ్చాము" అని హరి వంశీతో మెల్లగా చెప్పాడు.

"నిన్న రాత్రి కాస్త సీరియస్ అయింది అమ్మమ్మకు. మేమంతా సత్రంలో ఉండిపోయాము. పాపం సుప్రజ రాత్రంతా అమ్మమ్మ దగ్గరే ఉండి సేవలు చేస్తూ ఆమెకు ధైర్యం చెబుతూ సైకోథెరపీ లాంటి ట్రీట్‌మెంట్ ఇచ్చింది. మా పెళ్లి నిర్విఘ్నంగా జరిగేలా చూసింది" అంది మాధవి.

"సుప్రజ నిన్న రాత్రంతా సత్రం మేడపైన గదిలో డాన్సులు చేస్తూ ఉంది కదా" వంశీ అడిగాడు.

"ఛ...ఛ... ఆమెకలాంటివన్నీ నచ్చవు. మా మిగతా ఫ్రెండ్స్ చేసి ఉంటారు. సుప్రజకు సహనం, శ్రద్ధ, కరుణ ఎక్కువ. కనుకే ఆమెకు ఈ పని చెప్పాను. తనూ సంతోషంగా ఒప్పుకుంది" అంది మాధవి.

"అంత ఓపిక వున్న మనిషిని నేనింతవరకూ చూడలేదండీ. ఈ కాలపు పిల్లలా లేదు సుప్రజ. ఆమెను చేసుకోబోయేవాడెవడో చాలా అదృష్టవంతుడు" మాధవి తండ్రి అన్నాడు.

వెంటనే కారులో బయలుదేరి సత్రం చేరాడు వంశీ. సుప్రజ కోసం వెతికాడు. ఎక్కడా కనిపించలేదు. అతనిలో ఆందోళన పెరిగింది. మేడపైకి వెళ్లి గదిలో చూసాడు.

ఒంటరిగా పడుకుని ఏదో ఆలోచిస్తోంది సుప్రజ. ముఖంలో బాధ ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

"సుప్రజా!"

ఆ పిలుపు విని ఉలిక్కిపడి లేచి వంశీని చూసింది. ఆమె ముఖంలో ఆనందం. ఆమె ప్రక్కనే కూర్చుని "ఐయామ్ వెరీ సారీ. మిమ్మల్ని హర్ట్ చేసాను" అంటూ జరిగిందంతా చెప్పాడు.

"ఫర్వాలేదు. మీ స్థానంలో ఎవరున్నా అలాగే అనుకుంటారు" అంది సుప్రజ రిలీఫ్ ఫీలవుతూ.

"నేను నా జీవిత భాగస్వామిలో కోరుకున్న లక్షణాలన్నీ మీలో వున్నాయి. మీరు ఒప్పుకుంటే మిమ్మల్ని నాదాన్ని చేసుకుంటాను."

"కానీ మా అమ్మానాన్నల అనుమతి కూడా కావాలి."

"ఆ విషయం నాకొదిలేయండి. వాళ్ళను నేను మెప్పిస్తాను, ఒప్పిస్తాను. మా అమ్మానాన్నలు నా మాట కాదనరు."

"కానీ నాదో చిన్న మనవి" సుప్రజ అడిగింది.

"చెప్పండి."

"దయచేసి ఇంకెప్పుడూ నన్ను అపార్థం చేసుకుని మీ మౌనంతో నన్ను శిక్షించకండి" ఆమె కంట్లో నీరు తిరిగింది ఆ మాట అంటున్నప్పుడు.

"ఛ...ఛ.. మన మనసుల మధ్య అంతో ఇంతో దూరం ఉండడంవల్ల ఆ అపార్థం వచ్చింది. ఇక మన మనసులు ఒకటయ్యాయి. కనుక ఏ అపార్థాలూ మనమధ్యరావు. మీరు కన్నీరు పెట్టుకునే అవసరమే రానివ్వను. ప్రామిస్" అంటూ ఆమె చేతిలో తన చేయి ఉంచాడు. ఇంతలో ఫ్లాష్ వెలిగినట్లనిపించి ఇద్దరూ దూరంగా జరిగారు. నవ్వుతూ హరి, మాధవి లోపలకొచ్చారు.


"నీవు ప్రెజెంట్ చేసిన కెమెరాతో మొదటి ఫోటో ఓ అద్భుత దృశ్యాన్ని తీసాను. చూడు" అంటూ కెమెరాలోంచి బయటకువచ్చిన ఫోటోను వంశీకిచ్చాడు.

వంశీ, సుప్రజ చేతిలో చేయి పెట్టి మాట్లాడుతున్న దృశ్యమది. వంశీ సుప్రజకు ఫోటో చూపి అపురూపంగా తన జేబులో పెట్టుకున్నాడు.

"ఓ పెళ్లి మరో పెళ్లికి నాంది అంటారు. మన విషయంలో నిజమైంది. మీ సెలెక్షన్ అద్భుతం వంశీగారూ. కంగ్రాట్యులేషన్స్" అంది మాధవి.

"థాంక్స్" ఆనందంగా అన్నాడు వంశీ.

★




## బీచ్ డ్యాన్స్

హవాయి దీవిలో ఎప్పటి నుండో సాంస్కృతిక ఆచారం ఒకటుంది. సముద్రపు అలల్ని చూస్తూ ఇసుక తిన్నెలపై, అలల హోరు వింటూ వెన్నెల్లో డ్యాన్స్ చేయడం. ఏడాదికొక్కసారి జరిగే ఈ విన్యాసాల్లో చాలామంది పాల్గొంటున్నారు. టూరిస్టులకు ఇదే ఆటవిడుపు కూడా. సముద్రపు హోరులో ఇసుక తిన్నెలపై మ్యూజిక్‌కు అనుగుణంగా డ్యాన్స్ చేయడం థ్రిల్ కదూ!

## స్నానశాల

రాజుల కాలంలో స్నానశాలలు వుండేవి పెద్ద పెద్దగా. అదేమాదిరి భోపాల్‌లో మూడు వందల ఏళ్ళనాటి ఈ స్నానశాలలో ఇప్పటికీ 'స్టీమ్‌బాత్' చేసివస్తే, హాయిగా, రిలాక్స్‌గా వుంటుందని చెప్తున్నారు అందరూ. ఇంతకీ ఆ స్నానశాలని దేనితో తయారు చేసారయ్యా అంటే సున్నం, బెల్లం, వనమూలికలతో కలిపి నిర్మించారుట. ఇప్పటికీ చాలామంది కొంత డబ్బు చెల్లించి ఆ స్నానశాలకి వెళ్ళి స్టీమ్‌బాత్ చేసి రావడం ఓ విశేషం.



– శశి

